క్లుప్తంగా

నేడు వేంకటేశునికి జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలోని అలివేలు మంగ, గోదాదేవీ సమేత వైభవ వేంకటేశ్వరస్వామికి సోమవారం స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్ర పూజలు చేయనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రధానార్చకుడు బాలబాలాజీ ఆధ్వర్యంలోని పండితులు స్వామికి పంచామృతాభిషేకం పూజలు చేయనున్నట్టు తెలిపారు.

నేడు నియోజకవర్గ స్థాయి 'స్వచ్ఛత-మన బాధ్యత'

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం నియోజకవర్గ స్థాయిలో నేటి మధ్యాహ్నం 3 గంటలకు 'స్వచ్ఛత-మన బాధ్యత' రామచంద్రపురం పట్టణంలోని లయన్స్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎన్.కీర్తి స్పందన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ జిల్లాల కలెక్టర్లు, రెండు జిల్లాల డ్వామా పీడీలు, అధికారులు పాల్గొనే కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కాజులూరు: ద్వారపూడి, యానం రహదారిలో కాజులూరు మండలం కుయ్యేరు వద్ద ఆదివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఒకవ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. మండపేటకు చెందిన కరోతుల సూర్యప్రకాశ్ తన బైక్‌పై యానం వెళ్లి తిరిగివస్తున్నాడు. కుయ్యేరు వద్దకు వచ్చేసరికి రోడ్డుపై నడచి వెళ్లుతున్న ఒక వ్యక్తి అడ్డుగా రావటంతో షడన్ బ్రేక్ వేశాడు. బైక్ పల్టీలు కొట్టడంతో సూర్యప్రకాశ్ గాయాల పాలయ్యాడు. స్థానికులు గమనించి గాయాల పాలైన అతడిని యానం ఆసుపత్రికి తరలించారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో దుర్గాష్టమి



ద్రాక్షారామ ఓం శాంతి భవనంలో అలరించిన చిన్నారుల అమ్మ వేషధారణలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ఈశ్వరీయ ప్రజాపిత బ్రహ్మకుమారీ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఆదివారం దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు అమ్మవార్ల శక్తి రూపాల్లో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రహ్మకుమారి బిందు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముత్యాలమ్మ గుడివీధిలో రోడ్డు నిర్మాణం



టేకిలో సీసీ రహదారి నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న జేఈ రాఘవులు

కపిలేశ్వరపురం: టేకి గ్రామంలోని ముత్యాలమ్మ గుడి వీధిలో రూ.15 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మిస్తున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో స్థానికులు రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన నిధులు మంజూరు చేయించారు. రోడ్డును త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేనున్నట్టు డీఈ రాఘవులు తెలిపారు. ప్రభుత్వానికి, తోట త్రిమూర్తులుకు ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, సర్పంచ్ కుక్కల నాగమణి, ఎంపీటీసీ ఉమ్మిడిశెట్టి వీరవేణి, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్వేది ఆలయానికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని స్థానికులతో పాటు స్థానికేతరులు పుణ్యక్షేత్రంలోని కొలువైన లక్ష్మీనృసింహునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే స్వామివారి సోదరి గుర్రాలక్క అమ్మవారి ఆలయంలోను, ప్రధాన ఆలయంలోని ఉపాలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారి వద్ద కూడా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. పుణ్యక్షేత్రానికి తరలి వచ్చిన భక్తులకు నిత్యాన్నదాన పథకంలో భక్తులకు భోజన వసతిని ఏసీ కల్పించారు. కాగా ఆలయంలో సాధారణ, ప్రత్యేక దర్శనాల ద్వారా 7500 మంది భక్తులు స్వామివారి దర్శించుకున్నట్టు సత్యనారాయణ తెలిపారు. సుదర్శన హోమంలోని భక్తులు పాల్గొన్నట్టు ఆయన చెప్పారు.

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్ర మహోత్సవాలు

- విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం
- దుర్గామాతగా దర్శనమిచ్చిన విజయదుర్గ అమ్మవారు



ఓదూరు హోమ పూజలో పాల్గొన్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు దేవాలయాల్లో శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దక్షిణ కాశీ ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో 12 వ శక్తిపీఠం మాణిక్యాంబా అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన తదితర పూజలు ఘనంగా జరిగాయి. మాణిక్యాంబా అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులను అలరించారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో మహాకాళీ దేవి అమ్మవారి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు అలరించారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో పూజలు నిర్వహించారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో మంగళవారం నుంచి సాయి నవరాత్ర వేడుకలు నిర్వహించేందుకు నిర్వాహక కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా విజయదశమి మొదలుకుని బాబావారి ఆలయాల్లో భక్తులు నవరాత్ర వేడుకలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ఈ నెల 24వ తేదీ మంగళవారం నుంచి ప్రారంభమవనున్న సాయి నవరాత్రులు నవంబర్ రెండో తేదీ గురువారం వరకు కొనసాగనున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బాబావారి ఆలయాలకు రంగులు వేయించి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం బాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించి మధ్యలో పంచామృత అభిషేకం, విష్ణు సహస్ర సామూహిక పారాయణ, అష్టోత్తర విభూది పూజలు నిర్వహించనున్నారు. రాత్రి సమయాల్లో భక్తులు జ్యోతులను చేతపట్టుకుని సాయి నామకీర్తనలు ఆలపిస్తూ గ్రామోత్సవాలు నిర్వహిస్తారు. ఆలయం వద్ద తొమ్మిది రోజులు రోజుకో కార్యక్రమం చొప్పున జ్యోతిర్లింగార్చన, గోమాత పూజ, హరికథ, బుర్రకథ వంటి కచేరి కార్యక్రమాలు నిర్వహిస్తారు. మండలంలోని కాజులూరు, ఆర్యావటం, చేదువాడ, గొల్లపాలెం, శీల, దుగ్గుదుర్రు, కుయ్యేరు తదితర గ్రామాల్లో బాబావారి నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. నవరాత్రుల తొమ్మిది రోజులు ఆర్యావటంలోని బాబావారి ఆలయం వద్ద నిత్యాన్నదాన సమారాధనకు నిర్వాహక కమిటీ సభ్యులు సిద్ధమవుతుండగా పలు గ్రామాల్లో నవరాత్రి మహోత్సవాల అనంతరం ఆలయాల వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

అరిషడ్వర్గాలను వీడితే దైవత్వానికి చేరువగా..

రాయవరం: మనస్సులోని అరిషడ్వర్గాలను వీడితే దైవత్వానికి దగ్గర కావచ్చని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. పీఠంలో విజయదుర్గా అమ్మవారు ఆదివారం దుర్గాదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పీఠానికి హాజరైన భక్తులను ఉద్దేశించి 'గాడ్' ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ..మంచి మనస్సు, ఆలోచన, సంకల్పం ఉన్నవారికి దైవం ఎన్నడూ తోడుగా ఉంటుందన్నారు. విజయదుర్గ అమ్మవారిని ఉదయం దుర్గాదేవి రూపంలో అలంకరించారు. చీమలకొండ వీరావధాని, శ్రీనివాసావధాని, కోట లక్ష్మీనారాయణ, నాగేంద్రశర్మలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూల పూజలు కావడంతో భక్తులతో పీఠం కిటకిటలాడింది. హిందూ ధర్మ ప్రచార పరిషత్ రీజినల్ అసోసియేట్, మాజీ కో-ఆర్డినేటర్ కందర్ప హనుమాన్ తదితరులు పీఠంలో పూజలు నిర్వహించి, పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారి చెంతన సామూహిక కుంకుమ పూజలు చేసారు. పీఠానికి వచ్చిన భక్తులకు ఘనంగా అన్న సమారాధన నిర్వహించారు.



మహాకాళీదేవి అవతారంలో ద్రాక్షారామ కన్యకా పరమేశ్వరి అమ్మవారు



దుర్గాదేవి అవతారంలో ఆదివారపుపేట పార్వతీ అమ్మవారు

వాడవాడలా ఘనంగా

మండలంలో శరన్నవరాత్ర ఉత్సవాలు తుది దశకు చేరుకున్నాయి. దుర్గాష్టమి కావడంతో పలు ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. పలుచోట్ల ఆలయాల్లో అమ్మవారిని నయనానందకరంగా అలంకరించారు. మండలంలోని సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి, వెంటూరులోని ఉమా సోమేశ్వరస్వామి, రాయవరంలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, చెల్లూరులోని అగస్త్యేశ్వరస్వామి, పసలపూడిలోని పార్వతీ సమేత రాజేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్మవారి దీపోత్సవం

మండపేట: శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని 15వ వార్డులోని రాజరాజేశ్వరీ పీఠంలో కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారి దీపోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు జ్యోతులు వెలిగించి అమ్మవారి ఊరేగించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, కౌన్సిలర్లు ఎర్నేని ప్రభావతి, శెట్టి కల్యాణి, నీలం దుర్గ, ఏఎంసీ డైరెక్టర్ కొప్పిరెడ్డి పద్మ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి జ్యోతి ఊరేగింపులో పాల్గొన్నారు.



అంగర పల్లపు వీధిలో పూజలు చేస్తున్న భక్తులు



మండపేట 15వ వార్డులో జ్యోతి ఊరేగింపులో మునిసిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి, కౌన్సిలర్లు

ఓదూరు దుర్గాష్టమి పూజల్లో పాల్గొన్న మంత్రి వేణు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు సోమేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన దుర్గాష్టమి పూజల్లో రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. ఆలయ ఈఓ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంత్రి వేణుకి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శివాలయం బ్రహ్మ దొంతికుర్తి ఈశ్వర శర్మ, అర్చకులు ప్రకాశశర్మ, గోపాలస్వామి ఆలయ బ్రహ్మ ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు, అర్చకులు చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, శ్రీనివాస చక్రవర్తిల బ్రహ్మత్వంలో 36 మంది వేద పండితులు ఆలయంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ వింజుమల్ల విమలకుమారి, మాజీ ఎంపీపీ వినకోటి శ్రీనివాస్, నాయకులు కొండేపూడి రామమోహనరావు, కొండేపూడి సురేష్, బుంగ అప్పారావు, రొక్కాల యేసేబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి పూజలు

కపిలేశ్వరపురం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మండలంలోని 19 గ్రామాల్లో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ శిబిరాల్లో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆదివారం సెలవు దినం కావడంతో శిబిరాల్లోని పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కపిలేశ్వరపురం దేవీ సెంటర్లో కుంకుమ పూజ చేశారు. అంగర పల్లపు వీధిలోని శిబిరంలో అర్చకుడు వారణాసి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో భక్తులచే సామూహిక పూజలు జరిగాయి.



పీఠంలో ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న గాడ్

కనకదుర్గమ్మని దర్శించుకున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రామచంద్రపురం: పట్టణంలోని కొత్తూరు రోడ్డు జోడు తూముల వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని పులి వాహన దుర్గ అవతారం రూపంలో అలంకరిచారు. ఆలయం వద్ద ఉదయం నుంచి కూడా కుంకుమ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అమ్మవారిని దర్శించి చండీ హోమంలో పాల్గొని పూజలు చేశారు. ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఝుట వీరభద్రరావు రచించిన అమ్మవారి ఆలయ చరిత్ర ఆడియోను సీఐ దుర్గారావు ఆవిష్కరించి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ బ్రహ్మ చెరుకుపల్లి గణేష్ శర్మ, ఆలయ అర్చకులు మద్దిరాల పవన్, కాండూరి ఆదిత్య ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



కొత్తూరు రోడ్డులోని కనకదుర్గమ్మ ఆలయం వద్ద చండీహోమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ వారిని ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని కూళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కుడుపూరులో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను గురించి వివరించి పత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి సంక్షేమం అందించాలనే ఉద్దేశంతో నవరత్నపథకాలు ప్రవేశపెట్టిందని దానిలో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా మధ్యవర్తిత్వం లేకుండా అందిస్తుందన్నారు. ప్రభుత్వం పేదలకు మంచి చేయాలని ఉద్దేశంలో పని చేస్తుంటే ప్రతి పక్ష పార్టీలు ఓర్వలేక అర్థం లేని వాదనలు చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ రానున్న కాలంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనే కొనసాగుతుందన్నారు. రానున్న కాలంలో కూడా ఇప్పుడు అందిస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకుంటామని చెప్పారు. ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలకు మేలు చేస్తామని చెప్పారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పిల్లి రాంబాబు, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, ఎంపీటీసీలు కొప్పిశెట్టి లక్ష్మణ్, పిల్లి దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు మేడిశెట్టి సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ నాయకులు సత్తిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కుడుపూరు సావరంలో లబ్ధి చేకూరిన వివరాలతో కూడిన పత్రాలను మహిళకు అందిస్తున్న మంత్రి వేణు

శ్రీకృష్ణతత్వం మహోన్నతం

అయినవిల్లి: శ్రీకృష్ణుని తత్వం మనకు బోధపడదని మహోన్నతమైనదని శ్రీనివాస ప్రభుజీ అన్నారు. ఆదివారం నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. శ్రీనివాస ప్రభుజీ మాట్లాడుతూ శ్రీకృష్ణుడు కష్టకాలంలో ఆదుకుంటాడన్నారు. ఆయన లేని స్థలం ఎక్కడ లేదన్నారు. ఆయన్నూ గుర్తించడం కష్టమైన పనే అన్నారు. ఆయన ఎక్కడ పడితే అక్కడ ఉన్నారు. అణువణువు ఆయనే రక్షణగా ఉండి కాపాడుతున్నారన్నారు. శ్రీకృష్ణనామం నిత్యం స్మరించిన వారికి ఏ లోటు ఉండదన్నారు.

అనారోగ్య బాధితుడికి సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి వైద్యం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.15 వేల నగదు సాయం అందజేశారు. కాకినాడకి చెందిన నామన రామ దుర్గ మణికంఠకి రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ మార్చాలని డాక్టర్లు తెలిపారు. ఈ వైద్యానికి సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. పేదరికంలో ఉన్న మణికంఠ కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం చూస్తున్నారు. దీంతో మణికంఠకు సాయం చేయాలని బంధువులు కోరగా ఆదివారం రావులపాలెంలో మణికంఠ బంధువు కోటిపల్లి శ్రీనుకు రూ.15 వేల నగదును సాయంగా కాశీ అన్నపూర్ణ సేవా సంస్థ సభ్యులు అందజేశారు.



వైద్యానికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

రావులపాలెం: దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో అమలవుతున్నాయని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అలాగే బడుగు, బలహీనులకు, కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని ఎమ్మెల్సీ అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీని బలపరుస్తూ మాదిగల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు నేకూరి రాజేష్ కుమార్, కొల్లు శ్యామ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ దళితులంతా నిరంతరం వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్‌ని మాల, మాదిగ, రెల్లి కుల కార్పొరేషన్లుగా విడగొట్టి మనకంటూ ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్ విదేశీ విద్య దీవెన పథకం ద్వారా చదువుకునే విద్యార్థులకు ఒక కోటి 20 లక్షలు స్కాలర్ షిప్‌ను అందిస్తుందని, జగనన్న ప్రభుత్వం విద్యకు, వైద్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుందని, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని అనేక రకాలైన పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చి మన రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కోడేలి సురేష్, మల్లవరపు శ్రీనివాస్, సిర్రా సూరిబాబు, చిద్దుల వెంకటరమణ, ఉండ్రాజవరపు ప్రసాద్ బాబు, చెయ్యేటి రాజశేఖర్, తాతపూడి అబ్బులు తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్